NK01A110

# మన సాహితి
# మధు భారతి

కళాప్రపూర్ణ
ఆంధ్రసరస్వతి
డా. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

# మనసాహితి

# మధుభారతి

కళాప్రపూర్ణ

ఆంధ్రసరస్వతి

**డా. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ**

మనసాహితి - మధుభారతి

కవయిత్రి. డా. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

---

ప్రథమ ప్రచురణ
జూలై 1978

సర్వస్వామ్యములు
రచయిత్రివి

మూల్యము
రు. 6-00

ముద్రణ:
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమండ్రి

మాన్యసోదరులు

మూర్తిగొనిన తెలుగు భాషాభిమానులు

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ

విద్యాశాఖామాత్యులు

సేవకే తన్ను అంకితం చేసుకొన్నధన్యజీవి

శ్రీ మండలి వేంకటకృష్ణరావుగారికి

ఆదరాభిమానములతో

అంకితము

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ

విద్యాసాంస్కృతిక శాఖవారి

సహాయ సహకారములకు

ధన్యవాదములు

## ఆంధ్రసరస్వతీవరివస్య

శ్రీ కృష్ణరాయామాత్యవర్యులకు ఈ మధుభారతి నందించే శుభవేళలో నామనవి.

మనసాహితి - మధుభారతి అనే యీ చిన్నికావ్యము ఇటీవల నేను రచించినది. ఈకావ్యసృష్టి చాలా అతర్కితోపపన్నముగా జరిగింది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్యఎకాడమీ సభ్యురాలనైన నన్ను సాహిత్య ఎకాడమీవారు తమప్రాతినిధ్యముతో ఆంధ్రప్రదేశ్ బాలల ఎకాడమీ సభ్యురాలుగా నొనర్చిరి. ఆసందర్భమున బాలల ఎకాడమీ ప్రచురణగా రూపొందిన బాలపత్రికకు పంపుకోరికతో వెన్నెల, కలువకన్నె, కోకిల మొదలైన మకుటములతో కొన్నిగేయములను రచించుట జరిగినది. అందాలరాశియగు మన తెలుగుసాహితీ వనమున పరిమళములు వెదజల్లు సుకుమార కుసుమముల సౌందర్యలహరులు పసిబిడ్డల పసిడి యెదలలో సన్నజాజుల గుత్తులుగా, సంపెంగల సౌరభములుగా గుబాళింపవలె నను ఆశకు ప్రతిరూపముగా మనసాహితి - మధుభారతి అనుగేయమును రూపొందించుటయు అనుకొనకుండ జరిగినది,

ఆసమయమున సోదరులు శ్రీ మండలి వేంకటకృష్ణరావుగారు ఆంధ్ర ప్రభుత్వమున విద్యాశాఖా సాంస్కృతిక శాఖామాత్యులుగా ఉండి అనేక సందర్భములలో, అనేక సమావేశములకు సన్నాహ్వానించి ప్రోత్స హించి యుండిరి.

తెలుగుభాషాసౌకుమార్యము సోదరులు శ్రీకృష్ణరావుగారి ఆకృతిగా తెలుగువలుకుల తల్లి పోహళించి యున్నది. తెలుగు బిడ్డడై తెలుగు మానిసియై, తెలుగు మంత్రియై ప్రపంచ తెలుగుమహాసభల వెలయించి, తెలుగువెలుగుల నేల నాలుగు చెఱగుల నుద్దీపింపజేసిన ఆ తెలుగు

మంత్రి గరువతనము, కాంతిమంతమగు సౌజన్యరేఖ, క్రాంతి పూర్ణమగు వివేకచైతన్యములు, జాతిశ్రేయము నుత్తేజ మొనరించు కార్యదీక్షయు, ఆమోదరూపమగు చారుచర్యయు, జనరంజనసుభగం భావుకమైన చిత్తసంస్కారమును మిగుల ప్రమోదావహములై నాయెదదలో తళ్కొత్తిన మధుభారతిని సోదరుల దరహాసపు వెలుగు పంటగా తెలుగుమాగాణమునందు వెలయింపజేయవలెనని సంకల్పించితిని.

సహజముగా ఎట్టిఆడంబరమును ఒల్లక, నిండుఎదదతో తెలుగు తల్లినుపచరించుట యందే తనువును ధన్యతనొందించు ధీరగంభీర హృదయులు శ్రీ కృష్ణరావుగారి నుండి ఎన్నినాళ్ళు అభ్యర్థించిననో కాని నాయీవేడికోలున కామోదముద్ర లభింపలేదు. ఏమైనను వారి సౌహృద య్యము పెంపున తుదకు వారి యియ్యకోలు పెన్నిధివలె లభించినది.

సోదరులు శ్రీకృష్ణరావుగారి యీపెద్ద మనస్సునకు నా ప్రణామములు.

శ్రుతిశిరస్సీమంతినియై, మధురవిపంచీశ్రుతులతో పరమేశుని భద్రసంకల్పమును సురుచిరాకృతుల తీర్చిదిద్దు పలుకులతల్లి యుల్లము నులసిల్లజేయు రుచిమత్కావ్యప్రసూనములల్లి ఆచల్లనితల్లి పదసేవ యందే తనువును ధన్యమొనరించుకొను భాగ్యజీవి, ఆంధ్రప్రదేశాస్థాన కవిశేఖరులు, కళాప్రపూర్ణులు కవితాశరధులు డా. దాశరథి సోదరులు నాయందాదరముంచి యీ మధుభారతికి 'అభ్యుదయ భానుకిరణ కాంతు'లనిడి నారచనకు విలువనిచ్చిరి.

వారికి నాకృతజ్ఞతాంజలి

సోదరి

ఊ. లక్ష్మీకాన్తమ్మ

# "అభ్యుదయ భాను కిరణ కాంతులు"

డా॥ దాశరథి

నా చిన్నతనంలో మధురకవి శ్రీ నాళం కృష్ణారావు గారి "మీగడ తరగలు", "వెన్నముద్దలు" మొదలైన కావ్యాలు చదివి, వారి సరళ సరస శైలికి ముగ్ధుడనై పోతుండేవాడిని. శ్రీ నాళం కృష్ణారావుగారు, బహుముఖ ప్రజ్ఞాశాలిని, విదుషీమణి, అయిన సోదరి, శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి పితృపాదులు.

తమ తండ్రిగారి తేటగీతిని గురించి లక్ష్మీకాన్తమ్మగారు ఎంతో మనోహరంగా చెప్పారు :

"భరతజాతి భవ్యరీతి
మెలగ, వసుధ, మిన్నయైన
తీరులన్ని, తేనె చినుకు
లద్ది యద్ది గోరుముద్ద
లమృతమట్టు లాహరింప
జేయ మధుర గీతలాడి
పసివారల భవితవ్యము
భద్రపరచిన మధురకవి
కృష్ణరాయ తేటగీతి"

మధుర కవి నాళం కృష్ణారావుగారి తేటగీతులు పసిపాపల భవితవ్యమును భద్రపరచడానికే ఉద్దేశించినవైనా, పెద్దలను సైతం, అలరించినవి.

అల్లే సోదరి లక్ష్మీకాన్తమ్మగారు ఎంత గొప్ప విదుషీమణి అయినా ఉభయ భాషాజలధులను ఆపోశనం పట్టినా, ప్రజలకు సన్నిహితంగా ఉండే సులభశైలిలో మాత్రాచ్ఛందస్సులో, అభ్యుదయ భావాలతో "మనసాహితి - మధుభారతి" రచించారు. తండ్రిగారి ప్రభావం తమపై ఉన్నదని నిరూపించారు.

ఈ గేయకావ్యం మాఅన్నగారైన శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారికి అంకితం. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజలకు తన జీవితాన్ని అంకితంచేసి అహోరాత్రములు వారికై కృషిచేసి, ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలు కాపాడిన మహావీరుడాయన.

''ఒకచో నేలను పవ్వళించు...." అన్న పద్యంలో మాదిరి మండలి వారికి, కారైనా, రైలైనా, బస్సైనా, కాలినడకైనా ఒకటే. తన సుఖం మరచి ప్రజలసుఖంకోసం పరిశ్రమించిన త్యాగశీలి.

కవులన్నా, పండితులన్నా, కళాకారులన్నా మండలి వారికి ఎంతో గౌరవం. తీయని తెలుగుభాష యెడ వారికిగల గౌరవం, అభిమానం వర్ణనాతీతం. ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు లాల్‌బహదూర్ స్టేడియం ఆవరణలోనే రాత్రులు పడుకుని యేర్పాట్లు సవ్యంగా జరిగేరీతిని చూసిన నిరాడంబర జీవి.

"తెలుగు విద్య కాకృతిగూర్చు దిట్టతనము
తెలుగు భాషను పోషించు తీవ్రశక్తి
తెలుగు సంస్కృతి రూపించు ధీరచరిత
తెలుగు కళలను సేవించు దివ్యదీక్ష
తెలుగు ప్రజనాదరణ సల్పు ధృతియు, మతియు

చేవగూర్చుచు నిన్ను నాశీర్వదింప
తెలుగు తనము నీరూపున నిలిచి వెలుగ
తెలుగు తల్లిని పూజించు దీక్ష యలర
దీప్తి మనుమయ్య వెయ్యేండ్లు తెలుగు మంత్రి !"

అన్నారు లక్ష్మీకాన్తమ్మగారు. మండలివారిని గురించి ఇంతకన్నా చక్కగా చెప్పడం అసాధ్యం అంటే అతిశయోక్తి కాదు. ఆయన అచ్చమైన తెలుగు మంత్రి.

సోదరులు శ్రీ మండలివారి యేబది రెండవ జన్మదినోత్సవ శుభసమయాన అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో జరిగిన కవిసమ్మేళనానికి అధ్యక్షత వహించే భాగ్యం నాకు కలిగింది. దిగ్దంతులవంటి కవులు పాల్గొన్నారు. ఆ సభలో సోదరి లక్ష్మీకాన్తమ్మగారు "రుధిరప్రస్థానం" అనే కవిత చదివారు. ఆ కవితవిని చాలా పరవశించి పోయాను నేను.

"ఈ చిమ్మ చీకటి విరిగి
ఈ అనంత విశాల విశ్వం కొమ్మల తెమ్మలలో
విరగ బూసిన వసంతోదయం
మన నేత్రేంద్రియ తర్పణం చేయదా!
ఎందుకు నయన తర్పణం చేయదు
అదే ఉషోదయం" అన్నారు కవయిత్రి.

ఇది ఎంతో విలక్షణమైన భావన. లక్ష్మీకాన్తమ్మగారి కలంలో అభ్యుదయభానుకిరణకాంతులు ఈ గేయకావ్యమంతటా కనిపిస్తాయి.

ఈ గేయ కావ్యంలో "మనసాహితి—మధుభారతి" అను కవిత అన్నిటికీ తలమానికం వంటిది.

మన తెలుగు బాస యొక్క బహుమునఖీమైన సౌందర్యాన్ని ఆవిష్కరించారు కవయిత్రి ఈ కవితలో. వెయ్యేండ్ల ఆంధ్ర కవితా సరస్వతి ఇందున్నది.

మనసాహితి మధుభారతి
శివరంజని, జ్ఞానాంజని

"స్వస్థాన వేషభాషల
ప్రస్తవమును సేసి, తెలుగు
ప్రజకు, తెలుగుపైన మోజు
కల్గించిన ఘన యశుండు ॥

నన్నయ్యనూ,

"దేశమన్న మట్టికాదు
దేశమన్న మనుషు" లనెడు
నగ్నసత్య మెలిగించిన

గురజాడ వారినీ

ఆ తరువాత ఇంకా ఆధునికులనూ
సంస్మరించారు కవయిత్రి.

రష్యను జానపదగాథకు స్వేచ్ఛానువాదమైన "పార్వనా" మరో గొప్ప కవిత.

"ఎప్పుడారని నిప్పుముద్దను
నిచ్చ వెలిగెడి నిత్య జ్యోతిని
తెగువ మీరగ తెచ్చి యిచ్చెడు
నాతడే హృన్నేతయగునిక."

అని ఆభామ పలుకగా అశ్వవీరులు సూర్యుణ్ణి తేవడానికి వెళ్ళుతారు. అది సాధ్యమైన పనా? వారు రారు. పార్వనాకు వివాహంకాదు. తనకు పతికాగల మహావీరుడు లభించనే లేదు.

ఈ గేయంలోని మిశ్రగతి గణాల పోహళింపు గురజాడవారి ముత్యాల సరాలను జ్ఞాపకం చేస్తుంది.

"మనసాహితి - మధుభారతి" అను ఈ గేయ కావ్యం సహృదయ పాఠకలోకమునకు అమూల్యమైన కానుక.

విఖ్యాత విదుషీమణి, కవయత్రీ, సోదరి ఊటుకూరి లక్ష్మీ కాన్తమ్మగారిని అభినందిస్తున్నాను.

మధురకవి కూతురనిపించింది ఈ మధురకవయిత్రి.

ఆధునిక కావ్య మణిహారంలో "మనసాహితి - మధుభారతి" నాయకమణి.

20, మే 78
మద్రాసు

డా॥ దాశరథి

---

## మధుభారతీ

## మణిమాలికా కిరణకాంతులు


| | పుట |
|---|---|
| తెలుగు మంత్రి | 1 |
| రుధిరప్రస్థానం | 2 |
| మనసాహితి - మధుభారతి | 5 |
| మనసంస్కృతి - ఘనసత్కృతి | 20 |
| పార్వనా | 23 |
| చదువుకో ఓబాల చదువుకో- | 33 |
| చిట్టిపాపల భవితవ్యము చెడగొట్టకుడాచార్యులు | 35 |
| అలనాడు ఇలలోన | 38 |
| కోకిలమ్మ పాడింది. | 41 |
| అది ఒక గడ్డిపువ్వు - | 43 |
| కలువకన్నె | 45 |
| ఓ చందమామా | 47 |
| వెన్నెల వెన్నెల | 49 |

# తెలుగు మంత్రి!

(ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామాత్యులు,
శ్రీ మండలి వెంకటకృష్ణరావుగారి యేబదియవ
జన్మదిన సంచికయందు ప్రచురింపబడినవి.)

పాయా ద్వేంకటరమణో భద్రకళ్యాణభూషణః ।
పంచాశజ్జన్మదిన దీక్షితం శ్రీ కృష్ణ మంత్రిణం ॥

ఋషి కల్పుడైన మనీషి యతడు చూవె!
ఆర్ష సన్నిభమైన దతని వాక్కు!
ఆంధ్రి కాతని సేవ అంధ్రమైనది చూవె
తెల్గు నభలరీతి దీప్తి నొందె!
భువనమాన్యత నొంది పూజ్యమయ్యెను చూవె
ఆంధ్రసంస్కృతి యాత డాదరింప!
తెల్గు పౌరుషశక్తి దీప్తమయ్యెను చూవె
కీర్తనీయమగు తత్కృషిని! భువన

మండలీకృత సద్యశోమండనుండు
ఇద్ధచరితుండు మండలి కృష్ణరావు
ననఘు నభినందనము సేతు నతని యేబ
దియవ జన్మదినోత్సవ దివ్యవేళ.

తెలుగు విద్య కాకృతి గూర్చు దిట్టతనము
తెలుగు భాషను పోషించు తీవ్రశక్తి
తెలుగు సంస్కృతి రూపించు ధీరచరిత
తెలుగుకళలను సేవించు దివ్యదీక్ష
తెలుగు ప్రజ నాదరణసల్పు ధృతియు, మతియు
చేవగూర్చుచు, నిన్ను నాశీర్వదింప
తెలుగుతనము నీరూపున నిలిచివెలుగ
తెలుగు తల్లిని పూజించు దీక్ష యలర
దీప్తి మనుమయ్య వెయ్యేండ్లు తెలుగుమంత్రి!

## రుధిర ప్రస్థానం

చలి చలి, చలి చలి
గడ గడ వణికించే చలి -
ఈ శీతువులో, ఈ నిశీథంలో

తరాతరాలుగా పేర్కొన్న ఈగాఢాంధకారంలో
నరనరాలు కొంకికవేసే ఈ చలిలో
చరాచరాలు దీర్ఘనిద్రపోయాయి

అబ్బా, చలి, ఎముకలు కొంకికేసే చలి !
రక్తం గడ్డ కట్టుకుపోయే చలి !

వ్రేళ్ళు కొంగర్లు పోతున్నాయి !
కాళ్ళూ, చేతులూ పెద్దబండలై పోయాయి
చలీ, చలీ, చలి ! రక్తం గడ్డకట్టుకుపోయే చలి !

ఏది దారి ! ఏది గమ్యం !!

కార్యాచరణానికి, కరచరణాలు
ఏమాత్రం వశంకావడంలేదు
మంగళభావసంకల్పానికి
మస్తిష్కం పనిచెయ్యడంలేదు

గడ్డగట్టిన రక్తం

దేశహితానికైన స్వాగతాలు స్వగతాలైపోయాయి
లోకకళ్యాణ సాధన వేదనగా మిగిలిపోయింది
ఉజ్జ్వల భవిష్యత్తుకు వేసే బంగరుబాటలు
బలు రక్కసి పొదల మాటులైపోయాయి
చలిచలి, చలిచలి, గడగడ, వణికించేచలి !
ఇంతేనా ! ఇది యింతేనా !
ఇక యింతేనా ?

గడ్డకట్టినరక్తం
అభ్యుదయ భానుని కిరణకాంతులకు
కఱగి, స్వేదజలాల కాలువగా ప్రవహించి
ప్రజల దుఃఖదైన్యాలను పోకార్చదా ?

ఈ చిమ్మచీకటి విరిగి
ఈ అనంత విశాలవిశ్వం కొమ్మల రెమ్మలలో
విరగబూసిన వసంతోదయం
మన నేత్రేంద్రియ తర్పణంచెయ్యదా ?
ఎందుకు నయనతర్పణం చెయ్యదు !

అదే ఉషోదయం !

దిగంతాలలోని వెలుగురేకల్ని
గుండెలలో పొదువుకొన్న మానవతావాది !
మండలీకృత ధర్మ తేజోమండలుడై వెల్గిన
ఉషస్తారయొక్క కిరణకాంతులతో

## మేల్కొని

మేల్కొని దిక్కాంత ఫక్కున నవ్వింది !
అలుముకొన్న చీకట్లను భీత్కారంచేసింది !
ఆక్రమించిన చలిగొంగకు గొంతునులిమివేసింది !

గడ్డకట్టినరక్తం కరిగి తిరిగి ప్రవహించింది ?
ఆంధ్రోజ్వల మహాసంస్కృతి రూపంగా
తొలికోడి సారించిన విపంచీరావం
ప్రాభాతిక మంగళారావంకాగా

మేల్కొని

మానవతారుధిరం ప్రస్థానం చేసింది
నవయువతలోని ఉడుకురక్తం
హిమశిఖరాలను అధిగమించి
ఆటంకాలను ఛేదించి

ఒక్క ఉదుటుతో,

కాంతిగోళాలను చేరుకొని
విజ్ఞాన నాళాలను నిండుకొని
చైతన్యప్రవాహమై ఆంధ్రావనిలో
దానవులపై విక్రమించి,
మానవత్వానికి ప్రోదిసల్పింది !

ఈ మహామంగళ రుధిరప్రస్థానం,
బధిరులను, విధురులను
మధుర భారతీమూర్తులుగామలచి, స్ఫూర్తినిచ్చింది.

---

(ఈగేయం ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామాత్యులు, శ్రీ మండలి వెంకటకృష్ణరావుగారి యేబదిరెండవ జన్మదినోత్సవ సందర్భంగా అవనిగడ్డలో చదువబడినది.)

# మన సాహితి –
# మధుభారతి

మనసాహితి, మధుభారతి
రసవాహిని, భువమోహిని.
జనరంజని, శివరంజని
అఘభంజని, జ్ఞానాంజని

మనసాహితి. మధుభారతి
రసవాహిని భువమోహిని.

తెలుగన్నను, వెలుగన్నను
ఒకటేయని, ప్రకటించిరి
మనవారలు, పెరవారలు

తెలుగన్నను తేనెయనిన
తియ్యదనము, తియ్యదనము
తెలుగన్నను, తెలివియనిన
తిన్నదనము, మిన్నదనము
తెలుగన్నను తేటదనము
క్రొత్తదనము, మెత్తదనము
తెలుగన్నను దీప్తియనెడు
క్లప్తిగనిరి, ఘనులందఱు

మన సాహితి – మధు భారతి

మనసాహితి, మధుభారతి
రసవాహిని, భువమోహిని,

తెలుగుదనము, తెలుగుభాష
తెలుగుకర్మ, తెలుగుజన్మ,
"బహుజన్మల తపఃఫలము"
అనిపల్కిన అప్పయార్య
నాదృతి కొనియాడదగును -

తెలుగుబాస, దేశభాష
లందులెస్స, యనుచునుడివి
కృష్ణరాయ సార్వభౌము
డేనాడో కీర్తించెను -

పడవపైన పయనించే
వేళలందు మనసునుండి
వెలువడుచును సుడులుదిరుగు
మధురమైన పాటబోలు
తెలుగుమాట, తేనెయూట
అనుచునాడె 'భారతి'కవి

మనసాహితి, మధుభారతి
రసవాహిని, భువమోహిని,

అందమెంతొ, చందమంత
భావమెంతొ, హావమంత
నాదమెంతొ హ్లాదమంత
రసమెంతో పసయునంత

శృంగారమ్మదియు నెంతొ
విక్రమార్భట వీరమంత
రక్తియెంతొ భక్తియంత
ఘనవిలసత్కరుణ యెంతొ
భణచ్ఛణత్క్రోధమంత
రాగమెంతొ త్యాగమంత
రౌద్రమెంతొ భద్రమంత
భాగ్యమెంతొ యోగ్యతంత
క్షోభయెంతొ శోభయంత
నవనవరసాస్వాదనా
భరిత పారవశ్యమంత
ధర్మమెంతొ, మర్మమంత
ధర్మ మర్మ కర్మ యంత
రమ్యార్థపు సూక్తియెంతొ
మహనీయపు శక్తియంత
జగము హితము నగణితముగ
ప్రకటించెడు ప్రక్రియంత .
మనసాహితి, మధుభారతి
రసవాహిని, భువమోహిని.

మన ఆంధ్రత్వము

స్వస్థాన వేషభాషల
ప్రస్తవమును సేసి, తెలుగు
ప్రజకు, తెలుగుపైనమోజు
కల్గించిన ఘనయశుండు

భారత రచనమ్ముపూని
అక్షరమౌ రమ్యార్థము
నందమ్ముగ కథలపొదివి
యందించిన ఘనతపస్వి
మతిమంతుడు మహిమాన్వితు
డాంధ్రవాణి ప్రథమార్చకు
డాద్యాంధ్ర కవివతంసుడు
నన్నపార్యు నాణ్యమైన
జ్ఞానమంత, కావ్యమంత.

అధ్వరంపు దీక్షనంది
అంధ్రావళి మోదమంద
సారమతిని భారతమును
తెనిగించియు తనప్రజలకు
వినిపించి, కనుతెలపించు
దర్పమెనయ, 'దైవనియతి
ధర్మదీక్ష శాశ్వత' మని,
పగకుమేల్మి లేకుండుట
పగజెందక వైరముడిపి
సుఖజీవన శోభదెలిసి
తనమనుగడ మలచుకొనిన
మనుజజాతి మాన్యమగును
అనెడు సూక్తి ఘనమైనను
అన్యాయము నడపంగను
సంగరంబులగు చొప్పులు
అనివార్యంబైన యపుడు

కష్టమ్ముల నష్టమ్ముల
సరకు గొనక సాహసించి
ధర్మనిర్వహణము సేయ
తలపడుటే తగవటంచు
గీతాసందేశ మొసగి
గరువతనము కలికితనము
తళుకు బెళుకు కులుకు నడల
వెలుగొందుచు విశ్వవీధి
విహరించిన విమలవాణి
అచ్చతెలుగు అందమ్ముల
గ్రుమ్మరించి కమ్మనైన
కావ్యమల్లి కవితాసతి
కొయ్యారము సవదరించు
తిక్కనార్యు దీక్షయంత -

మందారపు మకరందము
లెందెందున చిందువడగ
తెలుగు వాణి నృత్యశోభ
తెలుగుపలుకు లందమ్ములు
భాగవతపు మధుకలశము
నందు బట్టి ఆంధ్రప్రజకు
జుబ్బన చూరలుగానిడి
పురిసిళ్లను గ్రోలనిడిన
సహజ సుకవిధౌరేయుడు
పోతనార్యు స్ఫూర్తి యంత -

ప్రాపంచిక బంధమెల్ల
శతవిధముల ప్రచురపఱచి
భవ్యమైన బ్రదుకుతెఱవు
విమలసూక్తి వినిపించిన
వేమన వేదాంతమంత -
తేనెసోక నోరుతీయ
నగునట్టుల తేట తెలుగు
కందువమాటల నందము
గా, రామచరిత గానమొ
నరించిన జ్ఞానవల్లి
తెలుగు ఎదల దివ్వెయిడిన
మొల్లమాంబ యుల్లమంత -
మనసాహితి మధుభారతి
అఘభంజని శివరంజని -

రమ్యప్రబంధము:

తుచ్ఛసుఖము ; మీసముపై
తేనియయని, దేవతయా
తెఱగంటికి తెలియఖలుకు
ప్రవరాఖ్యుని ఋజువృత్తిని
వెలయించిన పెద్దతనము,
మణియబ్బిన పారవైచి
కనువిందగు గాజుపూస
కానవడిన కలభాషిణి
కలవృత్తము, కలకంఠము

మెఱయపల్కు వాజిచేతి
గారాబపు కీరవాణి
బోగారపు బోహళింపు,
జలజాతాసనుడు, భవుడు
వాసవాది సురలెల్లలు
భ్రాజితముగ పూజించెడు
సూనాయుధు కన్నతండ్రి
శిరమచ్చో వామపదము
తోడ తొలగ ద్రోయు, లలిత
చతురవచో సీమంతిని
నిత్యలసిత సత్యభామ
నయగారపు నర్మోక్తులు -
మనసిచ్చిన మగని నిచ్చి
మమతపెరుగ తాళలేక
గుట్టువీడి రట్టుసేసి
'హవ్వ' యనుచు రవ్వసేసి
బాళిసైపలేక చిలుక
రాయబారమున, రయముగ
విభు, కృష్ణుని పిలిపించిన
రాధామణి యాగడమ్ము
ముద్దుపలుకు మురిపెమ్ముల
మురిపించిన మురువు హరువు -

దేశమంటే:

దేశమన్న మట్టికాదు
దేశమన్న మనుషులనెడు
నగ్నసత్య మెఱిగించుచు
అప్పరాయ డాడినట్టి
కప్పురంపు పల్కువాసి.

సంఘమ్మును సంస్కరించు
సత్యాయుధ శక్తిగాగ
సాహిత్యము మలచినట్టి
వీరేశలింగ విభునుడి.

ధరణియందు నడయాడిన
ధర్మాకృతి దాశరథియె.
కలిప్రజలకు కల్పవృక్ష.
మనల్పశక్తి, యంచు, కావ్య
కల్పనతో విశదముగా
తెల్పినట్టి విశ్వనాథు.
శాశ్వతమౌ సత్యోక్తియు

భరతజాతి భవ్యరీతి
మెలగ, వసుధ, మిన్నయైన
తీరులన్ని, తేనెచినుకు,

దేశమంటే:

లద్దియద్ది, గోరుముద్ద
లమృతమట్టులాహరింప
జేయ మధుర గీతలాడి
పసివారల భవితవ్యము
భద్రపఱచిన మధురకవి
కృష్ణరాయు తెలగీఱ.
ఏదేశమునకేగినను
ఏపీఠముల నెక్కినను
నిలుపగవలెన్నీజాతి
నిండుగర్వమని యాడిన
రాయప్రోలు సందేశము.

ఇహబాధల నీసడించి
శాశ్వత సౌఖ్యమ్మనొసగు
ఈశ్వర విశ్వాసమలరి
మృదువిపంచీశ్రుతియగుచు
కదలునిండి, కాంతహృదయ
మనురంజింప, అనుకంపా
వివశులుగా అవశులుగా
విశ్వజనుల తలపువిలిచి
భక్తిహృదయ రక్తులుగా
ఉల్లములన్ కొల్లగొనుచు
పెల్లుబుకుచు వెల్లివిరిసి
పొంగిపొంగి ప్రవహించిన
కృష్ణశాస్త్రి కీర్తనఝరి.

సౌందర్య సౌరభము:

సౌందరనంద సౌరభము
తెలుగుసాహితి తోటలను
గుబాళించి సుమాళింప
పౌలస్త్యుని హృదయమర్మ
మాంధ్రసహృదయ విజ్ఞాతా
దఘ్నమగుచు దరహసింప
రసవాహిక లేతాముల
నెత్తించుచు పారించియు
తెలుగునేల నూరించిన
కాటురి వేంకటేశ్వరుల
సుమనోజ్ఞపు సుమబాలలు .

ప్రశస్తసాహితి:

శ్రీరాముని సచ్ఛీలము
జనకతనయ సాధ్వీత్వము
శ్రీకృష్ణుని చిత్రలీల
ద్రుపదాత్మజ ధీపటిమయు
ధ్రువకుమారు దృఢతపస్సు
ప్రహ్లాదుని భక్తిగాధ
అభిమన్యుని అమృతశక్తి
బాలచంద్రు ఘనశౌర్యము
మనమాంచాల మనస్విత
శ్రీ శివజీ దేశభక్తి

రుద్రమాంబ భద్రముద్ర
కన్యకమ్మ త్యాగగరిమ
పుత్తడిబొమ పూర్ణమ కను
దోయినిండ పొరలిపొరలి
ప్రవహించిన కరుణరసము
ఒక్కటొకటి యనగనేల
ఎన్నెన్నో ఇంకెన్నో

శూరపథము నేమాత్రము
తప్పిచనని వీరకథలు
కీర్తికథలు, స్ఫూర్తిసుధలు
ఇంకిపోని కరుణజలధు
లనురక్తులు భక్తచరిత
లన్నియు, మఱియెన్నో మన

సాహితిమెలసియు తెల్గుల
హృదయవీధి పురుఱు విప్పి
విహరించెను, స్పృహనించెను
తెలుగువాణి దివ్యనృత్య
శోభదెలిపి స్ఫూర్తినిచ్చె -

మనసాహితి, మధుభారతి
శివరంజని, జ్ఞానాంజని.

ఈదెవరని నిలువరించు –

సరియెవరని ముదలకించు

తెలుగుమాట, తెలుగుపాట

తెలుగుకళలు, తెలుగు హొయలు

తెలుగువీర్య శౌర్యమ్ములు

తెలుగుజాతి తెలుగుదీప్తి

తెలుగు సంస్కృతియన నొడలు

పులకించును, తులకించును

ఆనందము చిలికించును

పారవశ్య మొలికించును

తెలుగువాణి దివ్యతేజ

మంచిత శ్రుతుల నీనెడు

మృదువిపంచీరవ మొలుక

సరియెవరని ముదలకించు

మధుఋతములపంచమ శ్రుతి

కలగానము చెలరేగగ

ఈ

మధుబాణికి, మృదువాణికి

ఈదెవరని నిలువరించు

అచ్ఛమైన తెలుగుతోట
స్వేచ్ఛమెయిని పెరిగి పెరిగి
ఫలియించిన కవితారస
మాకందపు మధురిమతో
తులయేదని! వెలయేమని!
కచ్చెకుదిగి పిచ్చలించు !

అన్నమయ్య క్షేత్రయ్యల
త్యాగరాయ, రామదాసు
హృత్కేదారముల నుండి
యుద్గమించి యురవడించి
పరువులిడుచు, పయనించుచు
జీవకోటి సంతర్పణ
సలుప, మలకలై పాతెడు
గానామృత రసధునులో
హో యనుచును గుండెకుదిపి,
విహ్వాలించి తలలూపెడు
సభ్యజనుల సర్వస్వము
తస్కరించి తుస్కరించు!

వసుధయందు పసగల్గిన
పరభావుకశిరోమణుల
పరవశతను ప్రశ్నించును
ప్రశ్నించి పరామృశించు
మనసాహితి - మధుభారతి.

ఫలశ్రుతి:-

తేటతెలుగు మాటాడిన
మనుజులందు మనసుందును
తెలుగుతీపి రుచిమరిగిన
మనసులందు మమతపెరుగు
తెలుగువిద్య తెలిసినేర్వ
వెలుగుబాట పరచుకొనును
తెలుగుకళల లోతు తెలియ
ఆనందపు సంద్రమందు
మనసెంతో మైమరచుచు
ఓలలాడు తేలియాడు
తెలుగుపాట దీప్తితెలియ
అమృతార్ణవ మవఘళించు
తెలుగు ఎదల పదునెఱిగిన
తెలుగుతల్లి సేవజేయు
ఆవేశము కొసరి మసరు

తడియారని క్రొందళుకుల
పసమీరుచు వసవల్చెదు

ఫలశ్రుతి

తెలుగుతనపు సౌగంధ్యము
మేనలదిన నానుడులను
నోరూరగ పల్కు భాగ్య
మెవ్వారిదొ అవ్వారలె
ధరణియందు ధన్యులంధ్రు
మనసాహితి, మధుభారతి
రసహివాని భువమోహిని

మధురాంధ్రము మహనీయము
మధుకలశము పృథుశిఖరము
మహిమోన్నత హిమకుధరము
మందారపు మకరందము
శృంగారపు శిఖిపింఛము
కాంతాహృత్కమనీయము
సహితాశయ స్పృహణీయము
రాధావిభు రమణీయము
మనసాహితి మధుభారతి
అఘభంజని-శివరంజని

మాధుర్యపు సారధ్యము
మనభాషకె మనభాషకె
మాధుర్యపు టాధ్వర్యము
మహితమ్మౌ మహియందున
మనవాణిదె మనవాణిదె
మనసాహితి మధుభారతి
అఘభంజని శివరంజిని

# మనసంస్కృతి
# ఘనసత్కృతి

మనసంస్కృతి ఘనసత్కృతి
పుణ్యాకృతి భువనసుకృతి
మనసంస్కృతి ఘనసత్కృతి

పితృాజ్ఞను పాలింపగ
తనరాజ్యము వదలివైచి
వనవాసము సలిపి, తుదకు
జనరంజన సల్పుకొఱకు
తనకాంతనె వీడినట్టి
ఘనురాముని సృష్టించిన
మనసంస్కృతి ఘనసత్కృతి

దుష్టపాలనమ్ము ద్రుంపి
శిష్టపాలనమ్ము సేయ
పుడమినంత ఒక్కగొడుగు
నీడక్రిందచేర్చి, లోక
ధర్మరక్షణకై, యుద్ధ
భూమియందు గీత, నరుల

కుపదేశము నిచ్చినట్టి
శ్రీకృష్ణుని సృష్టించిన
మనసంస్కృతి ఘనసత్కృతి

కరుణనేర్పి ధరణిజనుల
ఋణపఅచిన ఋషిసత్తము
సిద్ధార్థుని సృష్టించిన
మనసంస్కృతి ఘనసత్కృతి

శరణువేడు శత్రునైన
అభయమిచ్చి ఆదుకొనెడు
పృధ్వీరాజు, పురుషోత్తము
డాదిగగల రాజర్షుల
తేజరిల్ల జేసినట్టి
మనసంస్కృతి ఘనసత్కృతి

సర్వోత్తమ ధర్మమ్మగు
ఆధ్యాత్మిక ధర్మబోధ
ఉర్విగల్గు జనులకెల్ల
ఉత్తమముగ చాటినట్టి
ఘనుని వివేకానందుని
ఘనతను వెలయించినట్టి
మనసంస్కృతి ఘనసత్కృతి

మాతృభూమి రక్షణకై
కత్తిపట్టి, కదను ద్రొక్కి
కదనరంగమందు ఘోర
సంగరమును సల్పినట్టి
భద్రకాళి రుద్రమ్మను
పరిఢవిల్ల జేసినట్టి
మనసంస్కృతి, ఘనసత్కృతి

సత్యమహింసయు, నీభువి
నిత్యములౌ ధర్మములని
ప్రేమయే మానవతాను
లక్షణమని లెన్సదలికి,
సత్యాగ్రహ సమరమ్మును
శక్తిమీరిసలిపి, తాను
భరతమాతృ దాస్యముక్తి
గావించిన కరుణచందు
గాంధిదేవు సృష్టించిన
మనసంసత్కృతి, ఘనసత్కృతి

మనశాస్త్రము హితదస్త్రము
నిఖిలాప్తము ఖలశస్త్రము
భువనావన ధర్మాస్త్రము
మనసంస్కృతి, ఘనసత్కృతి

# పార్వనా

(రష్యను జానపదగాధకు స్వేచ్ఛానువాదము)

ఉన్నతాగ్ర కిరీటమమరగ
ఉర్వీతలమున పర్వమిగులుచు
గర్వరేఖల ఖ్యాతిచెందెడు
'అబులుమేటిను' అద్రిపంక్తులు
నిజకరమ్ముల నెత్తిపెంచిన
అందమైన విలాసదేశము
"పార్వనా" ప్రభవిల్లె పూర్వము

గగనమంటెడు ఘనశిఖరముల
ఠీవి నిల్చిన కోటకొమ్ముల
వాసముండుచు పార్వనాభూ
భాగమేలెను ప్రభువతంసుడు

సాటియని పూబోడులేరను
పోటిచేయగ బోవనట్టి
దివ్యసుందర దీప్తివిలసిత
ప్రభువతంసుని గారాబుసుత

మురళినూదుచు ముగ్ధమోహన
గానరవళిని సానుతలములు
ప్రతిరవించుచు పరవశింపగ
బాలకురంగి పోలిక బాలి

కామణి ప్రభుని హృదయ చిన్మణి
మెఱపు తీవగ మెఱసి మెఱసీ
లీలనాగిరి క్రీడసల్పును.
ప్రభుని పర్వత రాజ్యసీమయు
విభుని పావన హృదయభూమియు
పరవశించుయు నురవడించును
బాల లీలా హేలబొంగుచు.
రాగరంజిత భోగవశతను
కాలమంతట కదలిపోయెను
బాలవయసు ప్రఫుల్లమాయెను
బాలస్వయం వరమునల్పగ
ప్రభుడు దూతల పంపె దశదిశ
ఇలనుచుట్టుచు కలయవెదకిరి
రూపయౌవన శౌర్యగర్విత
దీప్తులౌయువ రాకుమారుల
కొఱకు దూతలు కోర్కెలూరగ -
ఎవరుకలరోకొ ఇలాతలమున
సాహసోత్కటశౌర్యధనులగు
ప్రభుకుమారులు, బాలసూర్యులు
కవచులై, కడుశీఘ్రగతితో
అశ్వమారోహించి నేర్పున
బాలహస్తము పట్టువారలు !
విభునిహృది మెప్పించువారలు !
అనుచు తిరిగిరి అవనిదూతలు !

ఖంగుఖంగున మ్రోగెకత్తులు
ఠంగుఠంగున దుమికె తేజులు
హంగుమీఱెడు వీరసింహులు
పొంగిపోవుచు ముగుదకొఱకై
ప్రాభవమ్మున పఱతెంచగా
ధవళమౌ ఆభవనసన్నిధి
పార్శ్వనా రమ్యాంగణమ్మున
కన్యపాణిగ్రహణకాంక్షలు
ఎదలలో పింపిళ్ళుగూయగ
ఎదిరివారి జయించుకోరిక
నిలిచియుండిరి, నిర్మలాత్ములు
రమ్యమూర్తులు, రాకుమారులు
నిలుచుకొనగా చెలువహృదయము !
ఇరుగుపొరుగుల యెల్లజనములు
ఇల్లువాకిలి విడిచిఉరికిరి
ప్రభునియాత్మజ పాణిపట్టెడు
శూరసింహుని చూచువేడుక !

మొయిలుచెంగట హొయలుచూపెడు
చంద్రరేఖకు సాటియౌ, చెలి
తండ్రి కరమును తానుబట్టుచు
నయనకాంతులు నాట్యమాడగ
మేనిసొబగులు మెఱసిపోవగ
రాజపుత్త్రుల రమ్యవీక్షణ
పంక్తులు బరాబరులుసల్పగ

దర్శనమ్మిడె తరుణీఆయువ
మన్మధులకును మనసుపొంగగ
చేతనామయ చేష్టలుడిగెను
నోటమాటలు వీటిబోయెను
అచటజేరిన రాచపుట్టువు
లాయతిలోకసుందరి, నతివ
గాంచి యప్రతిభులైనిలిచిరి
లోకగతినే విస్మరించిరి

“కన్నతల్లీ కాంచుమమ్మా
నీమృదుకరము, మధురహాసము
కోరిశూరులు, కోర్కెవచ్చిరి
స్వయంవరసుస్పర్ధదలపడ
సిద్ధపడి యేతెంచిరిటకును
వీరియోగ్యత వీక్షింపుమా

ప్రజలుమెచ్చెడు బలముగలిన
రాచపుట్టుక రాణించునిత
డశ్వహృదయాభిజ్ఞుడౌయీా
విశ్వవీరుని వీక్షింపగదె !
శస్త్రనైపుణి శత్రుగెలిచెడు
సాయుధపాణి యీాతడోయమ
రూపజిత మన్మధుండీతడు
నీచెలిమికై యేతెంచెనిటు
సోయగమొప్ప శోభగనుమా
ఈపరాక్రమ ధనులవిద్యా

ప్రదర్శనమది ముగిసినంతనె
సత్పరాక్రమ శాలియౌ, నీ
హృదయచోరు వరించివేడుక
ప్రసపగుచ్ఛము ప్రణయునకిడి
అనుభవింపుము అతులసౌఖ్యము
విశ్వమంతయు నీర్ష్యగొనగా
ప్రణయరాజ్యము దక్కగొనుమా
ఇటులనుడువుచు నిలాత, లేశు
డాప్రదర్శన మారంభింప
గోరి, కేలు సారింపనపుడు
కుసుమకోమలి, కుసుమగుచ్ఛము
కేలద్రిప్పుచు లీలవచించె,
"బలప్రదర్శన గెలుచు వీరుడు
ఖ్యాతిగడించు ఘనుడౌ - కాని
అంచితశ్రుతి యగు నాహృద్వి
పంచీతంత్రి నా వీరుడెటు
సారించునో ? తంత్రిచెప్పుమ"
బాలఇట్టులు పలుకగానే
అఖిలవీరులు నామె బొదువుచు
పల్కరిట్టులు భానుతేజులు,
నీరజేక్షణ! నీహృత్పిర
మధివసించెడు భాగ్యమబ్బగ
మేముచేసెడి దేమొచెప్పుమ
దిక్కులన్నియు కొల్లగొట్టుచు

ధనముగొని నీ[మోలనుంతుమొ !
గగనరాజ్యము ఘనతజయించి
తారకాళిని కానుకిత్తుమొ
ఎదియువలతువొ ముదలయిమ్మా
వాలుచూపుల నేలుకొనుమా"
బాలవీరుల సవాలువినుచు
ఫక్కునన్నగి పడతియింపుగ
ముక్కుపైనా, మోపి[వేలును
తళుకుమోమున దరహసితమ్ము
లెనయగ, బెళుకుచూపులగములు
దోలుచు రాచబాలురనియె
ధనము గోరగ ఘనముగా, నే
వెఱ్ఱినాదునె ! వింతయగునిది !
వసుధలోగల వజ్రరాసుల
నాహరించిన హర్షమొదవదు
తారకాళిని ధరణిజేర్చిన
సంతసమ్మది సుంతగలుగదు
నాకరాజ్యము నా[కమించిన
ఆశతీరదు లేశమయ్యును
ఎప్పుడారని నిప్పుముద్దను
నిచ్చవెలిగెడు నిత్యజోతిని
తెగువమీరగ తెచ్చియిచ్చెడు
నాతడే హృన్నేతయగునిక
మేలుగలుగగ నేలుసన్నిక

బావపల్కిన పల్కువించునె
అశ్వమారో హించివీరులు
ప్రీతి, నారవి జ్యోతివెదుకగ
సర్వదిశలకు సాగిపోయిరి
ఎన్నినెలలో, యెన్నియేండ్లో
గడచిపోయెను, నడచిపోయెను
ఆరిపోవని అగ్నితేరగ
వెడలినట్టి వీరులెవ్వరు
తిరిగిరానే రాకపోయిరి

"ఎచటకేగిరొ యుద్ధశౌర్యులు !
వత్తురెతిరిగి వారలిచ్చట
కారిపోవని యగ్నిగొంచును
అట్టిజ్యోతిని దిట్టతనమున
కాంచగలరో, కాంచలేరో"
ధైర్యమలరగ, తండ్రి! చెప్ప వె
"అమ్మతగునె అధైర్యమిట్టుల
ఆరిపోవని అగ్నితెచ్చుచు
వారుతప్పక వత్తురమ్మా
వారిత్రోవలు భయంకరములు
అచటభూము లాపత్కరములు
భీతిగొల్పుచు వీతిహోత్రుం
డెపుడుమండెడి కపటహ్రదములు
కామరూప పిశాచమయములు
మృత్యుదుర్గము లెన్నొగడచియు

అగ్నితేవలె నమ్మవారలు
అట్టులయ్యునే మాయెతల్లి
భయమెఱుంగని బంట్లువారలు
వారుతప్పక వత్తురమ్మా
ఆరటమేల ! కొనుమఊరట !"

కాలమెంతో గడచిపోయెను
జ్యోతిగొనుచును ప్రీతిగదురగ
రారైరి ఇక వీరులెవ్వరు
"అయ్య ? చూడు, గవాక్షమందున
వారలెవరే వచ్చిరేమో !
స్వప్నమందున చాలతడవలు
నేనుమెచ్చిన మేటివీరుడు
ఆరిపోవని అగ్నితెచ్చుచు
కానబడియెను కనులుదెఱువగ
నదృశ్యమాయె ! నదియుచోద్యము !"
"ఓర్మివహింపుమో సుపుత్రీ
అగ్నిగొంచును అతడురాగల
డగ్నిదేవుండతనిమెచ్చియు
కార్యసిద్ధిని కలుగజేయును
కష్టసాధ్యము కార్యమియ్యది
కాలమెంతో గడువవచ్చును''

మఱలకాలము దొరలిపోయెను
వెలదినిరీక్ష విఫలమాయెను
సాహసికులౌ యయ్యాశ్వికులు

తిరిగిరారేతీరుగాంచిన !
"నాయనాయిది యేమిచోద్యము !
నిచ్చలారని నిత్యజ్యోతీ
ధరణిలేదో తండ్రిచెప్పవె ?
వైపరీత్యము ! వింతఘటించె
చిత్రప్రవృత్తిని చింతదహించె
తనయదుఃఖము గనుచుతేదును
బదులుపలికెడు కుదురెలేకయు
బరువుగా నిట్టూర్చియెంతో
ఖేదమందెను ! బాధచెందెను

ఏండ్లుగడచెను పూండ్లుగడచెను
కమ్మనైనా, కొమ్మకోరిక
తీరువెలవే తోచదయ్యెను
అశ్వవీరులు మఱలివచ్చే
జాడయేపొడ సూపదయ్యెను
నిరాశతోడ, నిస్పృహతోడ
అతివకోరిక అణగిపోయెను
వనిత ఆశాలతలు వాడెను
మూర్తిజెందిన శోకదేవత
యగుచుమూర్ఛిలె నతివయంతట
కనులవెల్వడు కన్నీరులట
మున్నీరులై ముంచెదుర్గము
సురుచిరమ్మగు సుదతివీక్షణ
యుగళివెల్వడి సాగెడిబాష్ప

పూరమందున మునిగిపోయియు
విభునిదుర్గము తీవివిడువదు
దుఃఖవార్నిధి దోగియు నహా!
పడతిసుందర ప్రభయణంగదు

రాత్రిచీకటి ప్రామికొనగా
అఖిలసౌధగవాక్షకోటుల
వెలుగు వెల్వడి పెల్లుబుకగా
వేనవేలుగ శలభజాతులు
దీపపురుగులు దీపశిఖలను
దాడినల్పగ త్వరంపడుచును
చుట్టుముట్టుచు సురిగిపోవును
అగ్నిశిఖలను నాహుతియగును
ఆగ్నిశిఖలో నాహుతయ్యే
ఆతుసుళ్ళే అశ్వవీరులు
రాకుమారుల టంద్రుజనములు
పావమెలుగని ఆపురుగుగమి
దీపకాంతుల తృప్తిమీరగ
కొనుచుపోయెడు కోర్కెప్రబలగ
దారిబోవుచు దూరమెఱుగక
భారమనకను వచ్చివాలుచు
ఆశకెఱయై నాశనమ్మగు

# చదువుకో ఓబాల చదువుకో

చదువుకో ఓబాల చదువుకో
చదువుకో ఓబాల చదువుకో

చదువ వలసినట్టి చదువేదో
తెలుసుకొని మఱిమఱీ చదువుకో

బ్రదుకు విలువ తెలిపేటి
చదువులన్ని చదువుకో

పదునైన బుద్ధినిచ్చి
పరువమ్ము నింపునట్టి
చదువులన్ని చదువుకో

చదువుకో ఓబాల చదువుకో

తెలుగుదీప్తి తెలిపినిన్ను
తెలుగుగా తీర్చునట్టి
చదువంతా చదువుకో

నలుగురితో కలిసి మెలిసి
వెలుగుబాట నడుపునట్టి
చదువంతా చదువుకో

చదువుకో ఓబాల చదువుకో

మనసుపెంచి మమతపెంచి
మాధవుగా దిద్దునట్టి
చదువులే చదువుకో

ఘనమైన జ్ఞానమిచ్చి
ఆధ్యాత్మిక ఘనతనిచ్చి
మనుజులను మనిచేటి

చదువులే చదువుకో

దిశలన్నీ యశమునింపు
తెలుగుజెండ చేతబట్టి
సరియైన పథముబట్టి
సరిగా కేసరిగా
ముందుకు మునుముందుకు నడచిపో

చదువుకో ఓబాల చదువుకో

## చిటిపాపల భవితవ్యము చెడగొట్టకు డాచార్యులు

ఎట్టాడిన, నట్టాడుచు
అట్టిట్టని యనజాలని
చిటిపాపల భవితవ్యము
చేజేతుల చేదునించి
చెడగొట్టకుడాచార్యులు
చెడగొట్టకుడాచార్యులు
చదువుకొలకు సాముచేసి
చదువును సాధించి, ముందు
బ్రతుకున బంగారుకలలు
పండింపగ నభిలషించు
పసిపాపల భవితవ్యము
చెడగొట్టకు డాచార్యులు
చెడగొట్టకు డాచార్యులు
ఆచార్యుండుత్తరుండు
శిష్యవరుడు పూర్వతదుడు
శిష్యునందు నాచార్యుడు
గురువునందు శిష్యుండును
చరితార్థత సాధింపగ
విద్యయొకటి సేతువగును
పావనమగు పరమార్థం

బిట్టులుండ. నిదితెలిసియొ
తెలియకయో, మరివిద్యా
రంగమ్మున యందుకూడ
స్వార్ధపరుల పలుకుబడియె
చెల్లుచుంట గర్హ్యముకద
గురునిమించు శిష్యుండును
గురువును పూజించుశిష్య
డుంట, కోరదగినగుణము
తనయునుండి జనకుండును
పుత్త్రసముడు శిష్యునుండి
ఆచార్యుడు అపజయమును
కోరుటయే వరణీయము
'విజ్ఞత విద్యకు ఫలమ'ని
'బోధించుట పుణ్యం'బని
గురు శిష్యులు పరస్పరము
ప్రేమించుటె విద్యయనియు
తెలియలేని తీరుగలుగ
ఉత్తమమౌ ప్రమాణమ్ము
లున్నతమౌ లక్ష్యములను
సాధించుట సాధ్యపడదు

నమ్మెలంచు చదువుమాని
దిమ్మదిరుగు తీర్థప్రజలు
విద్యార్థులు వేనవేలు
చదువుసంధ్య బోధింపక

ప్రైవేటులు చెప్పుకొంచు
పేపర్లను దిద్దునపుడు
వేనవేలు గుంజుకొనుచు
బొజ్జనిమురు కొనెడివారు
ఒజ్జలెమటి లక్షలుంద్రి
ఇన్విజిలేషను కేగునపుడు
ఐదుపదుల లంచమ్ముల
కాసపడియు, అసమర్ధుల
తొలగింపక, దూష్యరీతి
వర్తించెడు అధికారులు
కొల్లలు కోకొల్లలుభువి
విద్యనేర్పు రంగమ్మున
వింతలిన్ని ప్రబలియున్న
చదువులెట్టు లబ్బు మనకు

తలిదండ్రులు తమధర్మము
పాటింపరు, పాటింపరు
విద్యార్థులు తమ విధులను
తెలుసుకొనరు, తెలుసుకొనరు
బడిపంతులు తమబాధ్యత
గుర్తింపడు, గుర్తింపడు
పాలకుల కీపని యసలె
పట్టబోదు ! పట్టబోదు !
నరజన్మము చరితార్థత
నందుటెట్లొ అరయుదయ్య

# అలనాడు ఇలలోన

అలనాడు ఇలలోన
కలిమి వెన్నెల
విరిసిందీ
అలనాడు ఇలలోన
చెలిమి పవనము
వీచింది

ఏనాడు బాపుజీ
దివినుండి భువిలోన
అవతరించెనో

ఆనాడు ఈనేల
అంధకాసురుని పెను
బంధమ్ములన్ ద్రుంపి
చెఱనుండి విడివడియె

ఆనాడు ఈవేల
ఘూర్ణిల్లు పెనుదాస్య
దైన్యవారాశికిని
ఆనకట్టలుపడియె

ఏరోజు గాంధిజీ
ధారుణిన్ కరుణించి
జన్మనేగై కొనియె

ఆరోజు భారతమున
అమృతాబ్ధులుపొంగె
హిమవంతుడే పెరిగి
చలువజాబిలి యయ్యె

ఏఘడియ మహాత్ముడు
పుడమిపై నడుగిడుచు
తనపాదపు చూపించె

ఆఘడియు జగతినే
అగడుగుడిపిన యట్టి
జగడమ్ములును సమసె

అలనాడు ఇలలోన

ఆఘడియ జగతిలో
సత్యమ్ము శాంతమ్ము హింసయును
మూడడుగులై ముల్లోకముల
నావరించెను

ఏసురుచిరాక్రాంత శుభవేళ
కరుణసాంద్రుడు ధరణి
నరజన్మ నవదరించె

ఆ మరుక్షణమునందె
ఇరులురలె సిరిదొఅలె
భరత మాతృదాస్య
బంధమ్ములును తొలగె

అలనాడు ఇలలోన
కలిమి వెన్నెల
విరిసింది
చెలిమి పవనము
వీచింది

ఏనాడు బాపుజీ
దివినుండి భువిలోన
అవతరించెనా
అలనాడు

# కోకిలమ్మ పాడింది

కోకిలమ్మ పాడింది
కుహూ కుహూ కుహూకుహూ
లోకమంత ఆడింది
ఓహోయని తలఊపుచు
మళ్లమళ్ల వేడింది
　　　　కోకిలమ్మ పాడింది

ఏదో ఏదో తెలియలేని
ఆవేశము
ఎదనుండీ పొంగింది
అదేఅదే మాధుర్యానికి మత్తిల్లి
మదిని రాగము పొంగింది
　　　　కోకిలమ్మ పాడింది

ప్రకృతిమాత ఆనందపు భాండారము
వివృతమై అమృతధార కురిపించింది
ఆకృతి వహియించియు అమలగాంధర్వము
శంఖమెత్తి మొలసింది
కోకిలమ్మ పాడింది

వాసంతపు రమ్యోత్సవ
గీతమ్మై సాగింది
నవమన్మథు విజయోత్సవ
కాహళియై మ్రోగింది
కోకిలమ్మ పాడింది-

చిగురుమేసి పొగరెక్కిన
కోకిలమ్మ వగరుపాట
జగము మగల వగడు చేసింది
కోకిలమ్మ పాడింది

విరియబూచు మాకందపు
సిరియంతా మేనినంట
సందడితో ఇటునటు
దందడించు పిక సంతతి
పసపు బంతులాడు వాసంతిక
లక్ష్మిపాడు మంగళాంక గీతియట్లు
కోకిలమ్మ పాడింది

చెలరేగెడు సెలయేరుల
గలగల నాదమ్మ సెలగ
కోకిలమ్మ పాడింది—

## అది ఒక గడ్డిపువ్వు

అది ఒక గడ్డిపువ్వు
అందానికి పై వడ్డీగా
ఆనందాన్ని రువ్వు
అది ఒక గడ్డిపువ్వు-
జనపదంలో ఘనపథంలో
తలయెత్తుక నవ్వు

మనసుగల్గు మానవాళి
గుండెలపై కొనగోటిని చివ్వు

అది ఒక గడ్డిపువ్వు-

గవ్వకు కొఱగాని గడ్డిలో పుట్టినా
మవ్వపు సిరి నాదేయని
కయ్యానికి కాలుదువ్వు

అది ఒక గడ్డిపువ్వు-

తేంట్లు ముసరినా
పూబోంట్లు కొసరినా
కొఱవడని కొమిరెదనంతో కొవ్వు

అది ఒక గడ్డిపువ్వు-

అమలమైన ఆ అలరు అందానికీ,
ఆర్భాటపు ఆటోపాలకూ

బహుదవ్వు

అది ఒక గడ్డిపువ్వు
జనపదంలో ఘనపథంలో
తలయెత్తుక నవ్వు

అది ఒక గడ్డిపువ్వు-

# కలువకన్నె

తళుకు బెళుకు కలువకన్నె
కొలనులోన నవ్విందీ
అందాల చందమామ
చందమెఱిగి విక్కంది.

కులుకులాడి కలువభామ
వెలది వెన్నెలతోడ తాను
వలపు రాయబార మంపింది
అబ్బురమౌ ఆచంద్రుని
వలపు తెలిసి ఉబ్బిఉబ్బి పోయింది-

తళుకు బెళుకు కలువకన్నె
కొలనులోన నవ్వింది.

ధర్మవిగ్రహుండు
శ్రీరాముని తనతోడనె
పోల్చెదరని
నల్లకలువ
ఉల్లసిల్లిపోయింది-

తెలిగంటుల తెతికన్నుల
కాంతియంత తనదేనని
తెల్లగలువ తెలికాంతుల
తేకులనే తెలచితెలచి
మెలసిందీ

మాతృభూమి నుద్ధరించి
ధర్మము కాపాడునట్టి
వీర్యవిక్రమంపు
బావుటా నేనెనని
ఎఱ్ఱకలువ మిట్టిమిట్టిచూచింది.

తళుకుబెళుకు కలువకన్నె
కొలనిలోన మెలసింది
అందమైన చందమామ
చందమెఱిగి నిక్కింది-

## ఓ చందమామ

అందంతో పందెమా నీకు ఓచందమామ
ఆనందంతో అనుబంధమా నీకు ఓచందమామ
అంందగాడవనీ, ఆహ్లాద కారివనీ
లోకమంతా నిన్ను మెచ్చేరులే
సుశ్లోకుడనీ కీర్తించేరులే

అందంతో పందెమా నీకు ఓచందమామా
ఆనందంతో అనుబంధమా నీకు ఓచందమామా

చక్కనయ్యవు చిక్కనా బాగుంటావు
అందుకే

అందాలచుక్కలన్నీ నీవెంబడి బడి తిరిగేను
వలపు లొలికించే ఒయ్యారి కలువభామ
నిన్నుచూచుకొని విరగబడియేను పగలబడియేను

అందంతో పందెమా నీకు ఓచందమామా
ఆనందంతో: అనుబంధమానీకు ఓచందమామా

క్రొన్నెలవైనా నవ్వువెన్నెలలు విసిరేవు
పున్నమిరేలలో పూర్ణపురుషుడవయ్యేవు

అందంతో పందెమా నీకు ఓచందమామా
ఆనందంతో పందెమా నీకు ఓ చందమామా

ముఖంలో పిల్లిఉన్నా చలువ జాబిల్లివి చందమామా
అందుకే

నీరాకకోసం లోకమంతా ప్రాకులాడ్తుంది.
అంతేకాదు నీవు రానినాడు అదియెంతో
చెడ్డదినంగా భావిస్తుంది ప్రపంచమంతా
అందంతో పందెమా నీకు ఓచందమామా
ఆనందంతో అనుబంధమా నీకు ఓ చందమామా

## వెన్నెల, వెన్నెల

వెన్నెల, వెన్నెల అంతావెన్నెల
జగమంతా ధవళకాంతుల తళతళ
వెన్నెల, వెన్నెల అంతావెన్నెల
గగనసీమలో వెలిగెడు నెలబాలుని
నవ్వుల పువ్వుల వెండితెఱ
వెన్నెల, వెన్నెల అంతావెన్నెల—
కటికచీకటి రక్కసిగెల్చిన
చంద్రునివిజయ పతాకపుకలకల
వెన్నెల, వెన్నెల అంతావెన్నెల
విరహిజనమ్ముల హృదయసీమలను
భగభగమండుచు నిప్పులుకురిసే అగ్నిశిల
వెన్నెల, వెన్నెల అంతావెన్నెల
జ్ఞానులహృదిలో సత్యము వెలిగే
ఆత్మజ్యోతి ర్విలాసచిత్కళ
వెన్నెల, వెన్నెల అంతావెన్నెల
శిలలనుకరగీ, జలధులపెంచే
చైతన్యామృత దీధితిహస్తకళ
వెన్నెల, వెన్నెల అంతావెన్నెల
ప్రణయబంధితుల కుత్తేజమునిచ్చీ
గిలిగింతలుపెట్టే జలతారు జల
వెన్నెల, వెన్నెల అంతావెన్నెల
జగమంతా ధవళకాంతుల తళతళ
వెన్నెల, వెన్నెల అంతావెన్నెల